శభాష్.. ఆస్తిపన్ను వసూలు భేష్

జీహెచ్ఎంసీ సర్కిల్–16 అధికారులకు కమిషనర్ అభినందన



సర్కిల్–16 ప్రశంసాపత్రాన్ని అందిస్తున్న రోనాల్డ్ రోస్

అంబర్‌పేట్: ఆస్తిపన్ను లక్ష్యానికి మించి వసూలు చేసిన జీహెచ్ఎంసీ సర్కిల్–16 అధికారులకు కమిషనర్ రోనాల్డ్ రోస్ ప్రత్యేకంగా అభినందించారు. సర్కిల్–16 పరిధిలో రూ.53.65 కోట్ల ఆస్తిపన్ను వసూలు లక్ష్యంకాగా సర్కిల్ అధికారులు రూ.62.11 కోట్లు వసూలు చేశారు. దీంతో గురువారం కమిషనర్ ప్రధాన కార్యాలయంలో సర్కిల్ అధికారులు డీఎంసీ మారుతీదివాకర్, ఏఎంసీలు బి.రవీందర్. పి.రవీందర్, అధికారులు వేణు, రాజునాయక్‌లను ప్రత్యేకంగా అభినందించి ప్రశంసాపత్రాన్ని అందించారు.

ప్రజాసమస్యలను పక్కదారి పట్టిస్తున్నాయి..

పాలక, ప్రతిపక్ష పార్టీల వైఖరిపై బీఎల్ఎఫ్ ధ్వజం


దండి వెంకట్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: ప్రజాసమస్యలను పక్కదారి పట్టించే విధంగా పాలక, ప్రతిపక్ష పార్టీల వైఖరి ఉందని బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ దండి వెంకట్ విమర్శించారు. ప్రభుత్వం, ప్రతిపక్ష నాయకులు ప్రతిరోజూ ఒకరినొకరు విమర్శించుకోవడానికే సరిపోతుందన్నారు. జిల్లా కలెక్టర్లు నేరుగా ప్రజాసమస్యలపై దృష్టిని కేంద్రీకరించే విధంగా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గురువారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దండి వెంకట్ మాట్లాడుతూ బీఆర్ఎస్ హయాంలో జరిగిన కాళేశ్వరం, గొర్రెల పంపిణీలో స్కామ్, కార్ రేస్, హైదరాబాద్ చుట్టుపక్కల భూకబ్జాపై విచారణ జరుగుతున్న సమయంలో ఫోన్ ట్యాపింగ్‌లో పోలీసులే నేరస్తులుగా బయట పడుతున్నారని అన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు పాలనా యంత్రాంగంలో జోక్యం చేసుకునే పరిస్థితి లేనందున కలెక్టర్లే నేరుగా ప్రజల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఒక వైపు ఎండ తీవ్రత పెరుగుతున్నందున నీటిఎద్దడి నివారణకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా శేషసాయి


నియామకపత్రాన్ని అందుకుంటున్న శేషసాయి

ముషీరాబాద్: భారతీయ జనతాపార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యునిగా రోయ్యూరు శేషసాయి నియమితులయ్యారు. ఈ మేరకు గురువారం మహాంకాళీ జిల్లా పార్టీ అధ్యక్షుడు శ్యామ్‌సుందర్‌గౌడ్ చేతుల మీదుగా శేషసాయి నియామకపత్రం అందుకున్నారు. ముషీరాబాద్ నియోజకవర్గం అడిక్‌మెట్ డివిజన్‌కు చెందిన శేషసాయి మూడు దశాబ్దాలుగా బీజేపీలో క్రియాశీలకంగా పనిచేస్తున్నారు. ఆయన నగర యువ మోర్చా కార్యవర్గ సభ్యులు, కార్యదర్శి, ఉపాధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శిగా పనిచేసి రాష్ట్ర యువమోర్చా కార్యవర్గ సభ్యులుగా, అసెంబ్లీ నియోజకవర్గ కోర్ కమిటీ సభ్యుడిగా వివిధ స్థాయిల్లో పనిచేస్తూ గుర్తింపు తెచ్చుకున్నారు. తనకు ఈ బాధ్యతలు అప్పగించినందుకు బీజేపీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, కేంద్రమంత్రి, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. బీజేపీ బలోపేతం, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని అన్నారు.

అనాథ పిల్లల విద్యకు చేయూత


ఫౌండేషన్‌కు చెక్కు అందజేస్తున్న సీఈఓ సన్నీరెడ్డి

హిమాయత్‌నగర్: అనాథ చిన్నారుల చదువు కోసం తమ వంతు చేయూతనందిస్తానని ముందుకు వచ్చారు ప్రముఖ టెలికమ్యూనికేషన్స్ సంస్థ వీవోఐపీ సంస్థ సీఈఓ సన్నీ రెడ్డి. తెలుగు రాష్ట్రాల్లోని అనాథ విద్యకు తాము విరాళం అందించడం పట్ల ఆయన ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అప్‌లిఫ్ట్ ఫౌండేషన్ ప్రతినిధులకు ఆయన రూ. 5 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా సన్నీ రెడ్డి మాట్లాడుతూ... తెలుగు రాష్ట్రాలలో చిన్నారులు ఎదుర్కొంటున్న విద్యాపరమైన సవాళ్లను పరిష్కరించడం కోసం తాము సహాయం అందిస్తామన్నారు. అనాథ పిల్లలకు నాణ్యమైన విద్య, ఉజ్వల భవిష్యత్తు కోసం తాము భవిష్యత్తులో మరిన్ని సహాయ కార్యక్రమాలు చేపడతామన్నారు. సమాజాన్ని, జీవితాలను మార్చే శక్తి కేవలం విద్య వల్లనే సాధ్యమని, అందుకు అనాథ చిన్నారులు ముందుకు సాగాలని సన్నీ రెడ్డి ఆకాంక్షించారు.

'గాంధీ' డిప్యూటీలుగా శ్రీహరి, వినయ్‌శేఖర్ నియామకం


శ్రీహరి


వినయ్‌శేఖర్

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రి డిప్యూటీ సూపరింటెండెంట్‌లుగా రేడియాలజీ, జనరల్ మెడిసన్ ప్రొఫెసర్లు శ్రీహరి, వినయ్‌శేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు వైద్య ఉన్నతాధికారులు గురువారం ఆదేశాలు జారీ చేశారు. హాస్పిటల్ అడ్మినిస్ట్రేషన్‌పై మంచి అనుభవం ఉందని భావించిన వైద్య ఉన్నతాధికారులు రేడియాలజీ ప్రొఫెసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న శ్రీహరి, జనరల్ మెడిసిన్ ప్రొఫెసర్, ఏఆర్‌టీ సెంటర్ ఇన్‌చార్జి వినయ్‌శేఖర్‌కు డిప్యూటీ సూపరింటెండెంట్‌లుగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఇప్పటి వరకు డిప్యూటీలుగా విధులు నిర్వహించిన డెర్మటాలజీ హెచ్‌ఓడీ నర్సింహరావునేత వ్యక్తిగత కారణాలతో డిప్యూటీ పదవికి రాజీనామా చేయగా మరో డిప్యూటీ ఈఎన్‌టీ హెచ్‌ఓడీ శోభన్‌బాబు లాంగ్‌లీవ్‌లో ఉన్నారు. ఆస్పత్రి పరిపాలన, నిర్ణయాలు తీసుకోవడంలో సూపరింటెండెంట్ రాజారావు తర్వాత డిప్యూటీ సూపరింటెండెంట్‌ల పాత్ర కీలకం. తమకు అప్పగించిన బాధ్యతలను చిత్తశుద్ధితో నిర్వహించి, నిరుపేద రోగులకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు తమవంతు కృషి చేస్తామని శ్రీహరి, వినయ్‌శేఖర్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి



5కే రన్ నిర్వహిస్తున్న ఎల్‌బీనగర్ సర్కిల్ అధికారులు

ఎల్‌బీనగర్: ఓటరు అవగాహన కార్యక్రమాల్లో భాగంగా గురువారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం నుంచి ఎల్‌బీనగర్ రింగ్ రోడ్డు వరకు గురువారం 5కే రన్ నిర్వహించారు. ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ ఓటు వేసి భవిష్యత్‌ను నిర్ణయిద్దామంటూ నినాదాలు చేస్తూ ప్రజల్లో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ ముకుందరెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి పునాదిలాంటిదని ఆయన అన్నారు. ఓటరులో చైతన్యం తెచ్చేందుకు ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. పోలింగ్ శాతం పెంచేందుకు ఈ 5కే రన్ ఎంతగానో దోహదపడుతుందన్నారు. కార్యక్రమంలో సర్కిళ్ల డీసీలు యాదయ్య, జకియా సుల్తానా, సుజాతాతో పాటు ట్రాఫిక్ పోలీసులు, సర్కిల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కేఎల్, ఐఎస్‌టీపీ ఎస్‌బీ-ఆర్ఏఎస్‌ల మధ్య ఎంఓయూ

బంజారాహిల్స్: కేఎల్ డీమ్డ్ టు బీ యూనివర్శిటీ, రష్యాకు చెందిన ఇనిస్టిట్యూట్ ఆఫ్ సోలార్–టెరెస్ట్రియల్ ఫిజిక్స్ ఆఫ్ ది సైబీరియన్ బ్రాంచ్ ఆఫ్ రష్యన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ (ఐఎస్‌టీపీ ఎస్‌బీ–ఆర్ఏఎస్)తో పలు కీలకాంశాలపై ఎంఓయూ కుదుర్చుకున్నాయి. గురువారం ఇరు సంస్థల ప్రతినిధులు ఎంఓయూ పత్రాలను మార్చుకున్నారు. అయానోస్ఫిరిక్ ఫిజిక్స్, స్పేస్ వెదర్ డొమైన్‌లలో శాస్త్రీయ, విద్యాపరమైన సహకారాన్ని అందించే దిశగా ఈ ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా కేఎల్ డీమ్డ్ టు బి యూనివర్శిటీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ... ఈ భాగస్వామ్యం యూనివర్శిటీకి ముఖ్యమైన మైలురాయిగా నిలుస్తుందన్నారు. గ్లోబల్ అకడమిక్ ఎక్సలెన్స్‌ను ప్రోత్సహించడానికి దోహదపడుతుందన్నారు. తద్వారా ఆవిష్కరణల వైపు ముందుకు నడిపిస్తుందన్నారు. ఈ ఒప్పందం ద్వారా ఐఎస్‌టీపీ ఎస్‌బీ–ఆర్ఏఎస్‌తో ఉన్న తమ బంధాన్ని మరింత బలోపేతం కాగలదన్నారు.

మంచినీరు మెరుగ్గా..

'సాక్షి'తో జలమండలి డీజీఎం కార్తిక్‌రెడ్డి

సరఫరా సక్రమంగా!

ముషీరాబాద్ సర్కిల్ పరిధిలోని కాలనీలు, బస్తీలకు వేసవిలో మెరుగైన మంచినీటి సరఫరా ఉండేలా జలమండలి అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. రోజు విడిచి రోజు అన్ని కాలనీలకు, బస్తీలకు సక్రమంగా నీటి సరఫరా చేయడంతోపాటు కలుషిత నీటి సరఫరాకు తావు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. లీకేజీ, లోప్రెజర్ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరిస్తామని చెబుతున్నారు. కవాడిగూడ డివిజన్ డీజీఎం కార్తిక్‌రెడ్డి 'సాక్షి'ముఖాముఖితో పలు అంశాలను వెల్లడించారు. – కవాడిగూడ





సాక్షి: ఫిర్యాదులు ఎలా.. ఎవరికి చేయాలి?
డీజీఎం: సమీపంలో ఉన్న నీటినిల్వ కేంద్రాలకు నేరుగా వచ్చి మా మేనేజర్లను కలవవచ్చు. లోప్రెజర్, లీకేజీలు, ట్యాంకర్ బుకింగ్, మీటర్ రీడింగ్‌ల్లో తప్పులు, మంచినీటి విడుదలపై సమస్యలు ఉంటే 155313 నంబర్‌కు యజమాని క్యాన్ నంబర్ ఆధారంగా ఫిర్యాదు చేయవచ్చు.

సాక్షి: సర్కిల్ పరిధిలోని పలు కాలనీలు, బస్తీలలో నీటి సరఫరా సక్రమంగా ఉండటం లేదన్న ఫిర్యాదులపై మీ స్పందన?
డీజీఎం: రోడ్డునిర్మాణ పనులు జరుగుతుండటంతో తక్కువ సమయం విడుదల చేయాల్సి వచ్చింది. ఇప్పుడు ఎటువంటి ఇబ్బంది లేకుండా నీటి సరఫరా చేస్తున్నాం. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగిన సందర్భాలలో కొంత మేర జాప్యం జరుగుతుంది.

సాక్షి: దోమలగూడ గగన్‌మహాల్, బండ మైసమ్మ నగర్, ఎల్ఐసీ కాలనీలో లోప్రెజర్‌తో నీటి సరఫరా అవుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు?
డీజీఎం: లోప్రెజర్‌తో నీటి సరఫరా అవుతున్న ప్రాంతాలలో సమస్యను పరిష్కరించాం. కొన్ని సందర్భాలలో పై నుంచి తక్కువ సరఫరా అవుతుంది. దీంతో కొంత మేర ఇబ్బంది కలుగుతుంది. ఎగువ ప్రాంతాల వారికి ఇబ్బందులు లేకుండా ఇప్పటికే బూస్టర్‌లు ఏర్పాటు చేశాం.

సాక్షి: కలుషిత నీటి సరఫరా కాకుండా ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు..?
డీజీఎం: డ్రైనేజీ ఓవర్ ఫ్లో లేకుండా జీహెచ్ఎంసీ సిబ్బందితో సమన్వయం చేసుకుంటూ ఎప్పటికప్పుడు మరమ్మతులు నిర్వహిస్తున్నాం. కాలనీల్లో ఎక్కడైనా లీకేజీ సమస్య ఉంటే మా దృష్టికి తీసుకువస్తే తక్షణమే పరిష్కరిస్తాం.

సాక్షి: కవాడిగూడ పరిధిలో నీటి సరఫరా ఎలా జరుగుతోంది?
డీజీఎం: ప్రస్తుతం వేసవికాలంలో అవసరాలను దృష్టిలో ఉంచుకుని నీటి సరఫరాలో ఎక్కడా అంతరాయం లేకుండా చిన్న, చిన్న సమస్యలను అధిగమిస్తూ స్థానికులకు నీటి సరఫరా చేస్తున్నాం.

సాక్షి: వినియోగదారులకు మీరు ఇచ్చే సలహా..?
డీజీఎం: మంచినీటిని వృథా చేయవద్దు, ఎక్కడైనా మ్యాన్‌హోల్స్ పొంగుతుంటే మా దృష్టికి తీసుకురావాలి. కలుషిత నీటి సమస్య పరిష్కారానికి కృషిచేస్తాం.

కవాడిగూడ డివిజన్ పరిధిలో ప్రతిరోజు 4 గ్యాలన్ల తాగు నీరు అవసరం ఉంటుంది. మొత్తం 18 వేల మంచినీటి కనెక్షన్‌లు ఉన్నాయని డీజీఎం తెలిపారు.

రేపు స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం


స్విమ్మింగ్‌పూల్ పరిశీలిస్తున్న మారుతీదివాకర్

అంబర్‌పేట్: జీహెచ్ఎంసీ స్విమ్మింగ్‌పూల్‌ను శనివారం నుంచి అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ సర్కిల్–16 డీఎంసీ మారుతీ దివాకర్ తెలిపారు. గురువారం అంబర్‌పేట్‌లో ఉన్న జీహెచ్ఎంసీ స్విమ్మింగ్ పూల్‌ను సిబ్బందితో కలిసి ఆయన పరిశీలించారు. పూర్తిస్థాయిలో స్విమ్మింగ్ పూల్‌ను తీర్చిదిద్దాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట అధికారి వెంకట్ రెడ్డి, ఇతర సిబ్బంది ఉన్నారు.

9 నుంచి దేవాలయం వార్షికోత్సవం

చిక్కడపల్లి: వివేక్‌నగర్‌లోని ప్రసిద్ధ శ్రీ ఆంజనేయస్వామి దేవాలయ పునర్నిర్మాణాంతర ద్వితీయ వార్షికోత్సవాలను నిర్వహిస్తున్నామని ఆలయ ఈఓ దేవనాథం, ముఖ్యఅర్చకులు బుగ్గా లక్ష్మీపతిశర్మ తెలిపారు. ఈ నెల 9 నుంచి 25వ తేదీ వరకు వార్షికోత్సవాలు జరుగుతాయన్నారు. 9వ తేదీన క్రోధినామ సంవత్సర ఉగాది సందర్భంగా పంచాంగ శ్రవణం, 10న గణపతి హోమం, 17న సీతారామ కల్యాణమహోత్సవం, 18న శ్రీరామ పట్టాభిషేకం, 19న సుదర్శనహోమం, 20న రామతారక హోమం, 21న చండీహోమం వంటి తదితర పూజా కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు.

అన్ని పండగలను అన్నదమ్ముల్లా జరుపుకోవాలి

ఉప్పల్: ఉప్పల్ ఏక్ మినార్ మజీద్‌లో బుధవారం నిర్వహించిన ఇఫ్తార్ విందుకు కాంగ్రెస్ పార్టీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి పట్నం సునీత మహేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు, మధుయాష్కి, ఉప్పల్ నియోజకవర్గ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇఫ్తార్‌లు మతసామరస్యానికి ప్రతీక అన్నారు. రాష్ట్రంలో అన్ని మతాల వారు అన్నదమ్ముల వలె ఉంటారని, అన్ని పండగలను జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోందన్నారు. గతంలో మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గంలో రేవంత్‌రెడ్డిని గెలిపించిన విధంగా తనను మీ సోదరిలా భావించి భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉప్పల్ సమస్యలు తన దృష్టిలో ఉన్నాయని, ప్రతి సమస్యను తాను స్వయంగా పరిశీలించి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. మైనార్టీలకు కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

పలువురి మద్దతు కోరిన సునీత మహేందర్‌రెడ్డి
పార్లమెంట్ ఎన్నికల్లో తనకు సంపూర్ణ మద్దతు ఇవ్వాలని మల్కాజిగిరి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి సునీత మహేందర్ రెడ్డి గురువారం టీడీపీ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కందికంటి అశోక్ కుమార్ గౌడ్‌ను కలిసి మద్దతు కోరారు. ఉప్పల్ నేత మందముల పరమేశ్వర్‌రెడ్డితో కలిసి వచ్చిన వారు అశోక్ కుమార్ గౌడ్ ఇంట్లో భేటీ అయ్యారు.

పనులు సకాలంలో పూర్తి చేయాలి


న్యూ పటేల్‌నగర్ డ్రైనేజీ పైపులైన్ పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్

అంబర్‌పేట్: ఇప్పటికే చేపట్టిన అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలని అంబర్‌పేట డివిజన్ కార్పొరేటర్ విజయకుమార్‌గౌడ్ అధికారులకు సూచించారు. న్యూ పటేల్‌నగర్‌లో చేపట్టిన డ్రైనేజీ పైపులైన్ పనులను గురువారం అధికారులతో కలిసి పరిశీలించారు. పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటిస్తూ స్థానికులకు ఇబ్బందులు లేకుండా పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జలమండలి అధికారులు మాజిద్, రమేశ్, స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

వాష్‌రూమ్‌కని వెళ్లి.. వివాహిత అదృశ్యం


చందనప్రియ(ఫైల్)

నల్లకుంట: వాష్‌రూంకు వెళ్లి వస్తానని భర్తతో చెప్పి వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో ఆలస్యంగా వెలుగు చూసింది. ఎస్సై రమాదేవి తెలిపిన వివరాలు.. ప్రైవేట్ ఉద్యోగి జట్ల నరేష్, చందనప్రియ(22) 16 నెలల కుమారుడితో కలిసి మల్కాజ్‌గిరిలో నివాసముంటున్నారు. చందన ప్రియ తన భర్త, కుమారుడు సోమేష్(16 నెలలు)తో కలిసి ఈ నెల 1వ తేదీన సాయంత్రం గోల్నాక శంకర్‌నగర్‌లోని పుట్టింటికి వచ్చింది. అదేరోజు సాయంత్రం 6.30 గంటల సమయంలో మల్కాజ్‌గిరికి బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యారు. తిలక్‌నగర్ మెయిన్ రోడ్డులో గల కిషన్‌రావు ఆస్పత్రి వద్దకు రాగానే వాష్‌రూమ్‌కు వెళ్లాలని, బండి ఆపాలని భర్తను కోరింది. కుమారుడిని భర్తకు ఇచ్చిన చందన ప్రియ సమీపంలో ఉన్న ఓ అపార్టుమెంట్‌లోకి వెళ్లి అరగంట అయినా తిరిగిరాలేదు. భార్య ఇంతసేపు అక్కడ ఏం చేస్తుందనే అనుమానంతో నరేశ్ ఆ అపార్ట్‌మెంట్‌లోకి వెళ్లాడు. భర్తను గమనించిన చందనప్రియ అక్కడి నుంచి పారిపోయింది. ఆ తర్వాత ఎక్కడ వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. ఆందోళన చెందిన నరేష్ తన భార్య కనిపించడం లేదంటూ బుధవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వక్ఫ్‌బోర్డు స్థలాలను పరిరక్షించాలి


మాట్లాడుతున్న ఎంఏ సిద్దిఖీ

సుల్తాన్‌బజార్: వక్ఫ్‌బోర్డు భూములను పరిరక్షించడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ విమర్శించింది. హైదర్‌గూడ ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆల్ ఇండియా ముస్లిం మైనార్టీ ఆర్గనైజేషన్ చైర్మన్ సయ్యద్ ముక్తర్ హుస్సేన్‌తో కలిసి ఉమ్మడి ఏపీ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎంఏ సిద్దిఖీ మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో 77 వేల ఎకరాలు ఉన్న వక్ఫ్ భూములు చాలా వరకు కబ్జాలకు గురయ్యాయని వారన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ముస్లింల గ్రేవియార్డ్ కోసం 125 ఎకరాల భూమిని కేటాయిస్తామని హామీ ఇచ్చి విస్మరించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జోక్యం చేసుకొని వక్ఫ్‌బోర్డు భూముల నుంచి 125 ఎకరాల భూమిని గ్రేవియార్డ్ కోసం కేటాయించాలని విజ్ఞప్తి చేశారు.

చలపతిరావుకు ఇన్‌స్పైర్ అవార్డు



బోడుప్పల్: కలాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ యూత్ ఎక్సలెన్స్ ఫౌండేషన్ 2024 సంవత్సరం ఇన్‌స్పైర్ అవార్డును బోడుప్పల్‌కు చెందిన గుడిపాటి వెంకట చలపతిరావు అందుకున్నారు. ఈమేరకు గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన విద్యార్థులకు స్పేస్, టెక్నాలజీ అవగాహన, అవార్డుల ప్రదానోత్సవంలో ఇస్రో చైర్మన్ సోమనాథన్, మాజీ డీఆర్‌డీఏ చైర్మన్, రక్షణ మంత్రిత్వ శాఖ సలహాదారులు సతీష్‌రెడ్డి చేతులమీదుగా పొందారు. సంస్థకు చేస్తున్న సేవలను గుర్తించి తనకు ఈ అవార్డు రావడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఈ సందర్భంగా చలపతిరావు పర్యావరణ పరిరక్షణలో భాగంగా అంతరించి పోతున్న పక్షులు, పిచ్చుకలను కాపాడటంలో భాగంగా రైతులు పండించిన వడ్ల గింజల ధాన్యం గుత్తులను చైర్మన్ సోమనాథన్‌కు అందజేశారు. దీంతో ఆయన ఎంతో సంతోషించినట్లు చలపతిరావు వెల్లడించారు.

బాధ్యతలను విజయవంతంగా నిర్వర్తించాలి: కిషన్‌రెడ్డి


కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతున్న ప్రవీణ్‌కుమార్

అంబర్‌పేట్: పార్టీ అప్పగించిన బాధ్యతలను విజయవంతంగా నిర్వహించాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. అంబర్‌పేటకు చెందిన ప్రవీణ్‌కుమార్ ఇటీవల బీజేవైఎం రాష్ట్ర కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం కిషన్‌రెడ్డిని ఆయన నివాసంలో ప్రవీణ్‌కుమార్ కలిసి కృతజ్ఞతలు తెలిపారు. తనపై విశ్వాసం ఉంచి బాధ్యతలు అప్పగించిన కిషన్‌రెడ్డికి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, సహకరించిన సెంట్రల్ జిల్లా అధ్యక్షులు గౌతమ్‌రావులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సూర్యప్రకాశ్‌సింగ్ పాల్గొన్నారు.

పట్టాలు వచ్చాయని.. పట్టరాని ఆనందం


'గ్రాడ్యుయేషన్ డే' లో పట్టాలతో విద్యార్థులు, ఉపాధ్యాయులు

అంబర్‌పేట్: చిన్నారులు విద్యార్హత పట్టాలు అందుకొని మురిసిపోయారు. గురువారం డీడీ కాలనీలోని నారాయణ పాఠశాలలో ఒకటి నుంచి ఐదవ తరగతి పూర్తి చేసిన విద్యర్థుల గ్రాడ్యుయేషన్ డే సందడిగా జరిగింది. విద్యార్థులకు పాఠశాల జనరల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, ఏజీఎం బాలపరమేశ్వర్‌రావు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందించి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సవిత, సిబ్బంది లక్ష్మీభవానీ, నూర్జహాన్, మల్లికార్జున్‌రెడ్డి, సూజత, శిరీష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాంనగర్‌లో ఇఫ్తార్‌విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న శ్రీనివాస్‌రెడ్డి

ముషీరాబాద్: మతసామరస్యానికి ఇఫ్తార్ విందులో ప్రతీకలుగా నిలుస్తాయని మాజీ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రంజాన్ పండగను పురస్కరించుకొని బంధన్ ఫంక్షన్‌హాల్‌లో ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వాహెద్ అలీ, సలీమ్, నేత శ్రీనివాస్, శ్యామ్, సత్యనారాయణ, సిద్దిఖ్, వెంకటేష్, సమీర్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో తెలుగు రాష్ట్రాల్లో పోటీ చేస్తాం

దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి

లిబర్టీ: సార్వత్రిక ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లోని అన్ని స్థానాల్లో దళిత బహుజన పార్టీ అభ్యర్థులు పోటీ చేస్తారని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణస్వరూప్ వెల్లడించారు. లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... రాజ్యాధికార సాధన ద్వారానే దళితులకు బహుజనులకు విముక్తి లభిస్తుందని స్పష్టం చేశారు. స్వయం రాజ్యాధికారం సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం కోసం దళిత బహుజనులు త్వరలో రెండు తెలుగు రాష్ట్రాల జరిగే ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలని కోరారు. చంద్రబాబు నాయుడు అవకాశవాద రాజకీయాలతో మతోన్మాద బీజేపీతో పెట్టుకున్నాడని విమర్శించారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీలను తిప్పికొట్టాలని అన్నారు. దళిత బహుజనులను లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీకి పంపితే దళితులు ఎదుర్కొంటున్న సమస్యలను వారిని వినిపిస్తారని ఆయన స్పష్టం చేశారు.

చీటింగ్ కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలుశిక్ష

హిమాయత్‌నగర్: నారాయణగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చీటింగ్ కేసులో ఓ వ్యక్తికి ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. నారాయణగూడ ఇన్‌స్పెక్టర్ యు.చంద్రశేఖర్ తెలిపిన వివరాల ప్రకారం... జలిగామ సురేష్ అనే వ్యక్తి 2016వ సంవత్సరంలో నల్లన శరత్ అనే వ్యక్తికి హిమాయత్‌నగర్ స్ట్రీట్ నం–1లోని బాలప్ప రెసిడెన్సీలోని ఓ ఫ్లాట్ విక్రయించేందుకు అగ్రిమెంట్ చేసుకున్నాడు. ఇందుకు శరత్ సురేష్‌కు రూ. 9.25 లక్షలు చెల్లించాడు. అయితే ఇదే ఫ్లాట్‌ను సురేష్ ఇంతకు ముందే వేరొకరికి విక్రయించాడు. విషయం తెలుసుకున్న శరత్ తన డబ్బు తిరిగి ఇవ్వమని అడిగాడు. డబ్బు తిరిగి ఇవ్వకపోవడంతో 2016లో మోసం చేసిన సురేష్‌పై బాధితుడు శరత్ నారాయణగూడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడిపై ఐపీసీ 420, 406, 506 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసు పూర్వాపరాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన నాంపల్లి 9వ ఏసీఎంఎం కోర్టు న్యాయమూర్తి నిందితుడు జలిగామ సురేష్‌కు ఐదు సంవత్సరాల సాధారణ జైలు శిక్షతో పాటు రూ. 25 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు అని ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ వివరించారు.

ముగిసిన సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలు ముగిశాయి. రెండు రోజులు జరిగిన పోటీలలో ఓయూ పరిధిలోని 167 కాలేజీలకు చెందిన 1150 మంది విద్యార్థులు పాల్గొని వివిధ కళారూపాలను ప్రదర్శించారు. పోటీలలో ఎంపిక చేయబడిన విద్యార్థులను అంతర్ విశ్వవిద్యాలయాల సాంస్కృతిక పోటీలకు ఎంపిక చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

తోటమాలీలకు రెండు నెలలుగా జీతాల్లేవ్..

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–2లోని కేబీఆర్ పార్కు జీహెచ్ఎంసీ వాక్‌వేలో పనిచేస్తున్న తోటమాలీలకు గడచిన రెండు నెలలుగా జీతాలు లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఫిబ్రవరి, మార్చి నెలల జీతాలు చెల్లింపులో జరుగుతున్న జాప్యం వల్ల వీరంతా అప్పులు చేసి కడుపులు నింపుకోవాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కిలోమీటర్ల మేర జీహెచ్ఎంసీ వాక్ వే ఉండగా పచ్చదనం పరిశుభ్రత కోసం 31 మంది తోటమాలీలు గత కొన్నేళ్లుగా పనిచేస్తున్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ మినహాయించుకోగా వీరికి ఇస్తున్న జీతం రూ. 11 వేలు మాత్రమే. ఇంత చిన్న జీతం కూడా ప్రతి నెల సకాలంలో ఇవ్వడంలో సంబంధిత కాంట్రాక్టర్లు తీవ్ర నిర్లక్ష్యాన్ని కనబరుస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ స్పందించి ఈ తోటమాలీలకు జీతాలు ఇప్పించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.